
కథ



'రమ నా కూతురు కాదు' రంగారావు ప్రకటించాడు. సుప్రీంకోర్టు దాన్ని ఒప్పుకోవాలని కోరాడు. అది ఫుల్‌బెంచి ముందు అప్పీలయి కేసు నడుస్తూ ఉంది.

రమ తండ్రి రంగారావనీ, తండ్రి కులమే పుట్టిన పిల్లలకు వర్తిస్తుందనీ, అందువల్ల రమ క్షత్రియ స్త్రీ అనీ, యస్.సి. మాదిగ కాదనీ సింగిల్ జడ్జి తీర్పు చెప్పాడు.

ఆ తీర్పు మీద రంగారావు మండిపడ్డాడు. ఆమె తన కూతురు కాదని కోర్టుకెక్కాడు.

ఈ కేసుకు మూలం యస్.యస్.సి. స్కూలు రికార్డు. అందులో తండ్రి రంగారావు అనీ, కులం యస్.సి మాదిగ అనీ ఉంది.

రమ స్కూలు రికార్డులో తన పేరు తండ్రి పేరుగా ఉందని అతడికి తెలియదు. ఇప్పుడు తెలిసి చాలా దిగులుపడ్డాడు. అందుకు కారణం తన సుప్రసిద్ధ రాజవంశం పోయి యస్.సి. కులం కొత్తగా రాబోతుందనీ కాదు, రమ నేను నీ కూతుర్నని ఆస్తిలో వాటా అడుగుతుందనీ కాదు.

నిప్పులాంటి తన వ్యక్తిత్వానికి మచ్చగా ఈ తీర్పువల్ల అపఖ్యాతి వస్తుందని భయం. తనను వ్యభిచారి అంటారని దిగులు. గ్రంథసాంగు డంటారని కోపం. ప్రజల్లో పరువు పోతుందని వేదన. భరించరాని అసహనం.

రమకు యాభై ఏళ్ళు. ఆమె తల్లికి డెబ్బై సంవత్సరాలు. రంగారావుకూ దాదాపు అంతే వయస్సు.

'ఇంతకాలం రమను నా కూతురనే పెంచావా?' అని రసరాజ్యాన్ని అడగాలని తీర్పు విన్న దగ్గర్నుంచి చాలాసార్లు రంగారావు అనుకొన్నాడు.

** ** **

రంగారావు రాజు. ఓ.సి. ఆస్తిపరుడు. అంతస్తున్నవాడు. అందమున్న వాడు. అహంకాముున్నవాడు. నియమం నీతి నిష్ఠ ఉన్నవాడు. దైవభక్తి ఎక్కువ. చెడ్డపని చేయడు. మంచి పని మానడు.

అతడి భార్య ఎప్పటికీ ముసుగుతీయని అందగత్తె. నలుగురు పిల్లలు.


సంఘంలో సంపదకంటే, అభిజాత్యంకంటే, విలువైన మంచితనం పునాదుల మీద, తన అస్తిత్వ భవనం నిర్మాణం చేసుకొని తూగుటుయ్యేలలో కాలుమీద కాలు వేసుకొని ఊగుతూ, సుఖసంతోషాలలో తేలుతూ, గౌరవమర్యాదలు పొందుతూ, న్యాయధర్మాలను కాపాడుతూఉన్న సుఖ పురుషుడు రంగారావు.

## కొలకలూరి ఇనాక్

నిజానికి న్యాయ ధర్మాలను నిలబెట్టే దృష్టితోనే, ఎన్నడూ కోర్టు ముఖం చూడని రావు, సుప్రీంకోర్టు మెట్టు ఎక్కాడు.

** ** **

రమ తల్లి రసరాజ్యం మాదిగ కులస్థురాలు. ఆమె క్రైస్తవ మతం కానీ, మహమ్మదీయ మతంకానీ స్వీకరించలేదు. హిందూమత ధర్మం ప్రకారం జీవిస్తూ ఉంది. ఆమె మాదిగ పల్లెలోనే ఉంది. ఆమెను మాదిగ స్త్రీగానే అందరూ చూస్తారు. పిలుస్తారు. తలుస్తారు. ప్రేమిస్తారు. గౌరవిస్తారు. ఆదరిస్తారు. ఆరాధిస్తారు. ఆత్మీయంగా, ఆప్తంగా చూస్తారు. రమ పెళ్ళి హిందూ సంప్రదాయం ప్రకారమే జరిగింది. ఆమె తమ కులం వ్యక్తినే పెళ్ళాడింది. ముగ్గురు పిల్లలు కలిగారు. చింతల్లోని, చీకుల్లోని సంసారం.



** ** **

రసరాజ్యం పూర్వీకులు బాగా సంపన్నులు. పెద్ద మాదిగలని వాళ్ళను పిలిచేవాళ్ళు. ఆ కుటుంబం ఒకనాటి రాజరికానికి ప్రాతినిథ్యం వహించేది. కాలక్రమం లో రాజ్యం పోయినా సంపద మిగిలి ఉంది. పోయిన రాజ్యాలకు గుర్తుగా ఆమె తండ్రి ఆమె కు రాజ్యం అని పేరు పెట్టాడు. ఆమెకు తల్లి దండ్రుల నుంచి సంక్రమించిన సంపద, రంగా రావు సంపదకు పది రెట్లు ఉంటుంది. కోటంత ఇల్లు.

డెబ్బై ఏళ్ళ రసరాజ్యాన్ని చూస్తే ఎవరికైనా ఇప్పటికీ కళ్ళు తిరుగుతాయి. తిరిగి చూచేంత మంచి రూపం. పండిన పల్చటి తమలపాకులా ఉంటుందామె. వయస్సులో ఉన్న ఆమెను ఊహించుకోవటమే వరం.

రిటైరు కాబోతున్న జస్టిస్ బోనులో నిలబడ్డ, తనకంటే పెద్దదైన, ఆమెను కళ్ళార్పకుండా చూచి, తన ఇరవై ఏళ్ళ వయస్సునాటి కోరికల గుర్రాల దూకుళ్ళు బిగబట్టటానికి కళ్ళేలు కర్కశంగా లాగి, తనను తాను తడిమి చూచుకొని, గుండె దిటవు పరుచుకొని, కోటు సవరించుకొని, సీరియస్‌గా ముఖంపెట్టి, ఫేన్ తిరుగుతున్నా, చెమట చెలరేగి పోతుంటే, నోరూ వాయీ లేకుండా, చెవులు మాత్రం అప్పగించి కేసు విని తీర్పు చెప్పాడు.

జీవితంలో ఎప్పుడూ ఎక్కడా పరిచయ భాగ్యంలేని ఒక వృద్ధ స్త్రీ మూర్తి కనిపిస్తే సంచలించిపోయి జడ్జిమెంటు చదివిన న్యాయమూర్తి పరిస్థితికి భిన్నంగా కోర్టులేదు. కోర్టు జనంలేరు, లోకం లేదు. లోకుల్లేరు.

** ** **

రమ చురుకైన బాలిక. తెలివైన విద్యార్థిని. శ్రమించే, చక్కగా పని చేసే ఉద్యోగి, చాకచక్యం ఉన్న స్త్రీ. ఆంధ్ర విశ్వవిద్యాలయం లా విభాగంలో లెక్చరరుగా చేరింది. రీడరయింది. ప్రొఫెసరయింది. కాన్‌స్టిట్యూషనల్ లాలో పరిశోధన చేసింది. డాక్టరేటు పొందింది. మంచి ఉపన్యాసకురాలిగా, విశేష అధ్యయనశీలిగా, మేధావిగా రాజ్యాంగ నిష్ణాతగా ప్రపంచవ్యాప్తంగా ఆమెకు మంచి పేరు ప్రఖ్యాతులున్నాయి.

దయాధర్మ దాన గుణాలున్న కుటుంబంలో పుట్టటం వల్ల, సంపన్నుల ఇంట ఒక్కగానొక్క బిడ్డ కావటంవల్ల, తల్లి పోషణలో అల్లారు ముద్దుగా, అందాలు హద్దుగా, ఆనందాలు అవధిగా, ఆత్మీయతే అలంకారంగా ఆరోగ్యంగా అనంతంగా పెరిగింది రమ.

ఆమె స్వతంత్ర భారతదేశంలో పుట్టిన స్వేచ్ఛాజీవి. ఆమెకు ఆస్తి పాస్తులుండటంవల్ల, యస్.సి మాదిగ అయినప్పటికి, స్కాలర్‌షిప్ పొందలేదు, ప్రభుత్వ హాస్టల్లో చేరలేదు. స్కూలులో కాలేజీలో యూనివర్సిటీలో ఫీజులు కట్టింది. ఏ రాయితీలూ పొందలేదు.

ఆమె విశ్వవిద్యాలయంలో ఉద్యోగంలో చేరినప్పుడు కూడా రిజర్వే షన్ పొందలేదు. ప్రతి పదవికి సెలెక్ట్ అయింది. ఎక్కడా రిజర్వేషన్ లేదు. యస్.సిలకు అప్పటిలో విశ్వవిద్యాలయాలలో టీచింగ్ పోస్టుల్లో రిజర్వేషన్లు ఉండేవికావు. ఆమె యస్.సి అయినా నలభై ఏళ్ళ దాకా ప్రభుత్వమిచ్చే ఏ సదుపాయాలు పొందలేదు.

రమ కనుముక్కు ముఖం తీరు పూర్తిగా రంగారావును పోలి ఉంటుంది. ఆకారం అవయవ నిర్మాణం, తలకట్టు పోలికలెక్కువ. రంగు

రూపం అచ్చు గుద్దినట్లే! ఇద్దరినీ ఒక్కచోట చూస్తే ఎవరైనా వాళ్ళను తండ్రీకూతురూ అనుకొంటారు. కాదంటే నమ్మరు. న్యాయమూర్తులు కూడా నమ్మేస్థితిలో ఉండరు.

రమకు ఇద్దరు మగపిల్లలు. ఒక కూతురు. మగపిల్లలు అమెరికాలో కంప్యూటరు ఇంజనీర్లు. కూతురు కార్పొరేటు హాస్పటల్‌లో మంచి సర్జన్. ముప్పైఏళ్ళ కూతురు. పాతికేళ్ళు పైబడ్డ కొడుకులు వాళ్ళ జీవితాలు సుఖంగా జీవిస్తున్నారు. భర్త పేరు మోసిన క్రిమినల్ లాయరు.

ఆమె పేరు ప్రఖ్యాతులు విని ఒక రాజకీయ పక్షం ఆమెను ఎన్నికల్లో పోటీ చేయమని బలవంతం చేసింది. ఆమె ఇష్టపడలేదు. ఇంటా బైటా వత్తిడిపెరిగింది. విద్యారంగం నుంచి రాజకీయ రంగంలోకి ప్రవేశించటానికి ఆమె అంగీకరించలేదు. రాజ్యాంగం బోధించే మనిషి, దాని పని తీరు పరికించటానికి ప్రయత్నిస్తే తప్పు కాదంటే సరేనసుకొంది. పోటీ చేసింది. ఎస్.సిగా రిజర్వుడ్ నియోజకవర్గం పెద్ద మెజారిటీతో గెలిచింది.

పార్లమెంటరీ నియోజకవర్గం ఎన్నికల్లో ఓడిపోయిన ప్రత్యర్థుల్లో సమీప ప్రత్యర్థి కోర్టులో కేసు వేశాడు. ఆమె తండ్రి రంగారావు అనీ, ఆమె యస్‌సి కాదని, దొంగ సర్టిఫికెట్టుతో పోటీ చేసి గెలిచి, తన గెలుపుకు గండికొట్టిందని, ఆమె గెలుపు చెల్లదని, తన గెలుపు ప్రకటించాలని కోర్టు నాశ్రయించాడు. హైకోర్టు ప్రత్యర్థి కేసును కొట్టేసి రమ గెలుపును ఖరారు పరిచింది. అతనంతటితో ఆగక సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.

ఐదేళ్ళు ఆమె యం.పి.గా కొనసాగింది. ఆమె వాక్చాతుర్యం, కార్య చాకచక్యం చూచి మళ్ళీ ఎన్నికల్లో ఆమెకే టిక్కెట్టు ఇచ్చింది ఆ రాజకీయ పక్షం. ఆమెను మరింత మెజారిటీతో ప్రజలు గెలిపించారు. ఆ ప్రత్యర్థి మళ్ళీ కేసు వేశాడు.

మొదటి కేసు పునాది పూడిపోయినా, దాని మీద ఈ కేసు నిలబడింది.

రమ రెండోసారి యంపి అయి, లా మినిష్టరుగా పదవి చేపట్టింది.

అప్పుడే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పదవి ఖాళీ ఏర్పడింది. సామాన్యంగా అయితే క్యూలో ముందున్న జస్టిస్ చీఫ్ జస్టిస్ అవుతాడు. కానీ ఆ జస్టిస్‌కి సాంఘిక న్యాయం పట్ల సదవగాహనలేదని, అతణ్ణి తప్పించి, తరువాతి వ్యక్తిని చీఫ్ జస్టిస్ పదవిలో నియమించింది ప్రభుత్వం. అందులో లామినిష్టరుగా రమ పాత్ర లేకపోలేదు. ఇందిరాగాంధి హయాంలో ఉన్న కమిటెడ్ జ్యుడీషియరీ ప్రస్తావన తెచ్చి, సాంఘిక న్యాయం పట్ల కమిటెడ్ జస్టిస్‌ను చీఫ్ జస్టిస్‌గా నియమించారు.

బైపాస్ అయిన జస్టిస్‌కు రమ కేసు అప్పగించింది కోర్టు. అతను రాజ్యాంగం, హిందూ ధర్మశాస్త్రం ఆధారంగా తీర్పు చెబుతూ అనేక అంశాలు ప్రస్తావించి, అనేక కేసులు ఉదాహరించి, చివరకు తండ్రి కుల మే కూతురుదని తేల్చి, ఆమె ఎన్నిక చెల్లదని తీర్పు చెప్పాడు. ప్రత్యర్థి ఎన్నికయినట్లు మాత్రం ప్రకటించలేదు.

** ** **

రమ లా మినిష్టరుగా వెంటనే రిజైన్ చేసింది. రమ ఫుల్ బెంచికి అప్పీలు చేసింది.

ఈ కేసు పత్రికల్లో టి.వీల్లో విశేష ప్రచారం పొందింది. రంగారావు తన ప్రస్తావన చదివి, చూచి, విని ఉడికిపోయాడు. కేసు వేశాడు.

ఫుల్ బెంచి ముందు రెండు కేసులు నడుస్తున్నాయి. తన తల్లి రసరాజ్యమని, తను యస్.సి అని రమ వాదన.

రమ తన కూతురు కాదని రంగారావు వాదన. రెండు కేసులూ కలిసి కోర్టు న్యాయం చెబుతుంది.

రంగారావు కేసు రమకు ఉపయోగపడుతుందని ఎవరైనా ఊహించు కుంటారు. కానీ రావు కోరిక మాత్రం తన పరువు ప్రతిష్ఠలే! రమకు సహాయపడదామని అతడి అభిప్రాయం కాదు.

రమకూడా రావు సహాయం కోరుకోవటం లేదు.

'నా పేరు నీ తండ్రిగానీ స్కూలు రికార్డుల్లో ఉందా?' అని రమను రంగారావు అడిగితే మాట్లాడలేదు. బలవంతం చేస్తే 'నాకు తెలియదు' అంది.

కోర్టులో కనిపించిన రసరాజ్యంతో రంగారావు 'బాగున్నావా?'అన్నాడు.

ఆమె ఎగాదిగా చూచి వెళ్ళిపోయింది.

రసరాజ్యం తన భార్య కాదని, సంబంధం లేదని, అక్రమ సంబంధం కూడా లేదని, తనామెను ఉంచుకోలేదని, శారీరక, మానసిక సంబంధం కూడా లేదని తన స్వచ్ఛతను, పవిత్రతను, పెద్దమనిషి పరువు ప్రతిష్ఠలను కాపాడాలని కోర్టును కోరాడు రావు.

తన పేరు రమ తండ్రి పేరుగా స్కూలు రికార్డుల్లో ఉందని, ఇంటి పేరుతో సహా తన పేరు ఉండటంతో తాను చింతాక్రాంతుణ్ణయ్యానని, తన మానసికవేదన తొలగించాలని, అలా ఉందని ఈ ఏభై ఏళ్ళలో తనకు తెలియదని వాదించాడు.

** ** **

రసరాజ్యం, రంగారావు విశాఖపట్టణంలోనే ఉన్నారు. కానీ ఆమె ఒంటరిగానే జీవించింది. రంగారావుకు భార్యాపిల్లలున్నారు. రసరాజ్యానికి ఇంట్లో భర్త లేడు. రమ ఒక్కతే కూతురు. అల్లుడు, కూతురు ఆమెతోనే ఉంటున్నారు.

కోర్టు రసరాజ్యాన్ని నీ భర్త ఎవరూ అని ప్రశ్నిస్తే 'అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ రంగారావే నా భర్త' అంది.

మళ్ళీ రెట్టించి అడిగితే 'నాటికీ, నేటికీ, ఏనాటికీ రంగారావే నా భర్త' అంది. కోర్టు అంతకంటే ఏమీ అడగలేదు.

తల్లి పరిస్థితి రమకు స్పష్టంగా తెలుసు. తల్లి అంటే ఎనలేని గౌరవం. భక్తి. తల్లి దేవత. రమ కన్నీరు తుడుచుకొందేకాని, ఇప్పుడు ఏమీ చేయలేని దుర్భర స్థితి.

కోర్టు రమను ప్రశ్నించింది. 'నీ కులం ఏమిటి?'

'మాదిగ!'

మతం?

'హిందువు'

'క్షత్రియ కాదా?'

'కాదు.'

'తండ్రి కులం కూతురి కులం అవుతుంది కదా!'

'అది ఎవరైనా చెప్పేమాటే. న్యాయస్థానం, న్యాయవాదులు. న్యాయమూర్తులు ఆలోచించి వాస్తవం గుర్తించి ప్రకటించి తీర్పు చెప్పాలి. 'భార్యనో ఉంపుడుగత్తెనో, కడుపుచేసి వదిలేసిపోయి, పుట్టినబిడ్డను చూడని పెంచని పోషించని పెళ్ళిచేయని, కట్నకానుకలివ్వని, మనిషెవరో తెలియని వాడు కూడా తండ్రేనా?'

'తండ్రే!'

క్షేత్రం, బీజం మీద చాలాసేపు ప్రశ్నోత్తరాలు, వాదోపవాదాలు జరిగాయి. ఏమీ తేలలేదు.

** ** **

రసరాజ్యం, రంగారావు కలిసి అఆలు దిద్దారు. కలిసే ఆటలాడారు. పాటలు పాడారు. చెట్టాపట్టాలేసుకొని తిరిగారు. ఒకరు లేనిదే మరొకరుండే వాళ్ళు కాదు. వాళ్ళ స్నేహం, కలిసి తిరగటం, కలిసి తినటం, కలిసి పోట్లాడుకోవటం కలిసిమెలిసి ఉండటంగా సాగుతూ వచ్చింది.

యస్.యస్.యల్.సి.దాకా వాళ్ళు ఏ క్లాసూ తప్పలేదు. అన్ని క్లాసుల్లోనూ కలిసే ఉన్నారు.

ఎనిమిదో తరగతిలో ఉండగా, తాటాకు సింహాసనం దిగిన రసరాజ్యం మనస్సులో, హృదయంలో ఆలోచనలో అంతరంతరాలలో, శరీరంలో, శరీరం అన్ని భాగాలలో రంగారావే నిండి ఉన్నాడు.

స్కూలు ఫైనల్ దాకా వాళ్ళ స్నేహం సన్నిహితంగా, హితంగా, మితంగా అతి గాఢంగా నిగూఢంగా రహస్యంగా నిశ్శబ్దంగా విస్తరిస్తూ వచ్చింది. వాళ్ళదో కాల్పనిక జగత్తు. భావ కవిత్వంలో పుట్టి పెరిగిన జంట వాళ్ళు. ప్రేమ, ఆరాధన, ప్రేయసీ పూజనీయత, అమలిన శృంగారం, ఆత్మబంధం, హృదయ సౌందర్యం, హృదయేశ్వరి వంటి భావ శాబల్యంలో చిక్కుకుపోయిన జంట వాళ్ళు. రాజ్యాన్ని ఆ రోజుల్లోనే రంగారావు రసరాజ్యం అన్నాడు. 'రసం' అని పిలిచేవాడు. 'శృంగార రసాధి దేవతా!' అని పిలిచేవాడు.



అతడు దూరమవుతుంటే ఆమె దగ్గర కాసాగింది. ఎడం పెరుగుతుంటే సమీపానికి వచ్చింది. వెళ్ళిపోతుంటే వెంటబడింది. ఎగతాళి చేస్తుంటే ఏడ్చింది. పక్కకు పోతే పట్టుకొనేది. రావు చూడకపోతే తిండి తినేదికాదు. నిద్రపోయేదికాదు. బావిలో దూకుతాననేది. రైలుకింద పడతాననేది. ఏడిపిస్తే కిరోసిను పోసుకొని కాల్చుకొంటాననేది.

రంగారావు పొడుగ్గా పెరుగుతున్నప్పుడు మీసాలు కూడా మొలిచాయి. వాటిని మెలిపెట్టి తిప్పగా మంట పుట్టి అరుస్తున్న రంగారావును ఆటలు పట్టించిన అందగత్తె రసరాజ్యమే!

వాళ్ళ స్నేహం ప్రేమగా, పెళ్ళిగా మారే ప్రమాదం పసిగట్టిన తండ్రి కొడుకును కట్టడి చేశాడు. రసరాజ్యం తన ఇంటిలో స్వేచ్ఛాస్వాతంత్ర్యాల వల్ల హృదయ వైశాల్యంతోపాటు మానసిక స్థైర్యం పొంది స్పష్టమైన లక్ష్యం ఏర్పరచుకొంది.

తండ్రి ప్రోద్బలంతో, అభిజాత్యం నీడలో రంగారావు దాక్కోసాగాడు. రసరాజ్యంతో ఆటలు పాటలు మాటలు తగ్గించాడు. దూరం కాసాగాడు. కనిపించడం మానేశాడు.

అతడు దూరమవుతుంటే ఆమె దగ్గర కాసాగింది. ఎడం పెరుగుతుంటే సమీపానికి వచ్చింది. వెళ్ళిపోతుంటే వెంటబడింది. ఎగతాళి చేస్తుంటే ఏడ్చింది. పక్కకు పోతే పట్టుకొనేది. రావు చూడకపోతే తిండి తినేదికాదు. నిద్రపోయేది కాదు. బావిలో దూకుతాననేది. రైలు కింద పడతాననేది. ఏడిపిస్తే కిరోసిను పోసుకొని కాల్చుకొంటాననేది.

** ** **

అంతటితో ఊరుకోలేదు. రావు దూరంగా పోతే చంపుతాననేది. నన్ను కాదంటే నువ్వు బతకవనేది. నేను లేకుండా నువ్వు, నువ్వు లేకుండా నేను ఉండటం కుదరదంది. ఉంటే కలిసి ఉంటాం, చస్తే కలిసి చస్తాం అనేది.

స్కూలు ఫైనలు పాసయిన రంగారావు పై చదువులకు మద్రాసు పోయాడు. పరీక్ష తప్పి రసరాజ్యం విశాఖలోనే ఉండిపోయింది.

దూరమయిన మనిషి, గడచిపోయిన కాలం ఆమె రంగారావును మరిచిపోయేట్లు చేయలేదు. పైగా అతడి ఆలోచనలతో వేగిపోయేది.

రావు సెలవులకు వస్తే చూడాలని, మాట్లాడాలని, కలిసి అల్లరి చేయాలని తెగ ఆరాటపడేది. వాళ్ళింటికి పోయి కూడా భంగపడింది.

ఆమె ఆరాటం పోరాటంగా మారింది. తనను కాదని ఎక్కడికి పోతాడని మొండికెత్తింది. ఆమె గుండె బంతై ఎగిరెగిరి, పల్లంలో దొర్లిపోసాగింది. ఆ దశలోనే ఇంట్లో చెప్పకుండా మద్రాసు పోయి, రావు కనబడక, చేసేది లేక దిగాలుగా తిరిగి వచ్చింది.

రసరాజ్యం మళ్ళీ పరీక్షలు రాయలేదు. తల్లిదండ్రులు ప్రేమవల్ల తగినంతగా కట్టుదిట్టం చేయలేకపోయారు. అదుపాజ్ఞల్లో పెట్టలేకపోయారు. రావు దూరమై, తల్లిదండ్రులు బంధిస్తే చేసేదిలేక, ఇల్లు కదలక, జ్ఞాపకాల ముసురులో తడిసి ముద్దముద్దై అన్నం నీళ్ళు ముట్టక, చిక్కి సగమై వెర్రిచూపులు, మాటలు, చేష్టలు ఎక్కువై, పిచ్చిదానిలా మారిపోయింది.

రావు వచ్చేడంటే ఆశ, కనిపించకపోతే నిరాశ. చీకటి వెలుగులు రాత్రి పగలు అవమానం దుఃఖం అహంకారం ఆక్రోశం కేంద్రంలేని వృత్తంమీద కోపం, కసి, ద్వేషం, రావు కోసం ప్రేమ, ఆరాధన, ఆరాటం తాకిడికి తట్టుకోలేక అవమానం బరువుతో కుంగిపోయి, రసరాజ్యం మామూలు మనిషి కాలేకపోయింది.

** ** **

రమ తండ్రి రంగారావు అవునా కాదా అని నిర్ధారించటానికి డియన్ఎ టెస్టు అనివార్యమని కోర్టు భావించింది.

రంగారావు తిరస్కరించాడు. ససేమిరా ఒప్పుకోనన్నాడు.

కోర్టు ధిక్కారమవుతుందంటే 'కానీ'మన్నాడు.

జైలుశిక్ష పడుతుందంటే 'పడనీ' మన్నాడు.

అవమానమవుతుందంటే 'అవనీ' మన్నాడు.

'తన మాట కోర్టు నమ్మి తీరాలని రావు పట్టుదల. తనను డియన్ఎ టెస్టుకు గురిచేస్తే తన మాట, తన మాట తన మాట నమ్మనట్టే కదా! నన్ను నమ్మని కోర్టు మీద నాకు నమ్మకంలేద'ని ఎగిరాడు.

న్యాయవాదులు, న్యాయమూర్తులు నచ్చజెబితే, ప్రాణం పోయినంత పనయి అంగీకరించాడు.

**రసరాజ్యం, రంగారావు కలిసి ఆటలు దిద్దారు. కలిసే ఆటలాడారు. పాటలు పాడారు. చెట్టాపట్టాలేసుకొని తిరిగారు. ఒకరు లేనిదే మరొకరుండే వాళ్ళు కాదు. వాళ్ళ స్నేహం, కలిసి తిరగటం, కలిసి తినటం, కలిసి పోట్లాడుకోవటం కలిసిమెలిసి ఉండటంగా సాగుతూ**

రంగారావు ఎంత మొండివాడో కోర్టు చూసింది. జనం చూశారు.

ఈ వయస్సులో ఇంత మొండిగా ఉన్నాడే యౌవనంలో ఎంత మూర్ఖుడుగా ఉన్నాడో ఊహించుకోవచ్చునని నలుగురూ చెవులు కొరుక్కున్నారు.

రసరాజ్యం గర్భం ధరించాక పెళ్ళి చేసుకోమంటే తప్పించుకుపోయిన బండమనిషి, మొండిమనిషి అని జనం చెప్పుకోసాగారు.

** ** **

టెస్టు ఫలితం వచ్చింది. రమ రంగారావు కూతురుకాదని విజ్ఞానశాస్త్రం విశదం చేసింది.

అప్పుడు రసరాజ్యాన్ని కోర్టు ప్రశ్నించింది.

'రంగారావు నీకేమవుతాడు?'

'అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ రంగారావే నా భర్త'

'భర్తేనా?'

'నాటికీ నేటికీ, ఏనాటికీ రంగారావే నా భర్త'

'అతడి ఆస్తి కావాలా?'

'అడిగితే నా ఆస్తే ఇస్తాను!'

'అతడి కులం హోదా, గౌరవం కావాలా?'

'నా కులం, హోదా, గౌరవం నాకున్నాయి. నా కులం అతడి కులం కంటే గొప్పది. కావాలంటే నా కులమే అతడికి దానం చేస్తాను'


'మరి ఏరికోరి, భర్త కాని వాణ్ణి భర్త అంటున్నావు?'

'భర్త కాదనేవాళ్ళు ఎవరు?'

'రంగారావు'

'అతడెవరామాట అనటానికి'

'నేనంటున్నాను!' న్యాయవాది



'నువ్వెవరవు?'

'కోర్టును!'

'ఏది కోర్టు, గోడలా? బల్లలా నల్ల కోటులా? మామూలు మనుషులా? ఏది కోర్టు?'

'మరి రంగారావు భర్త అని ఎవరంటారు?'

'నేను! నేనంటున్నాను. నేనంటే సర్వలోకం నోరు మూసుకొని పడి ఉండాలి'

'భర్తని ఎవరు ఋజువు చేస్తారు?'

'ఇంత దేశం. ఇన్ని కోర్టులు, ఇందరు మేధావులు, ఇంత న్యాయం, ఇంత నీతి, ధర్మం, ప్రేమ, అనురాగం, ఆదరణ, ఆత్మీయత, అర్పణ, సమర్పణ, మైత్రి, సహజీవనం, సౌభాగ్యం, సౌశీల్యం, త్యాగం, నిరీక్షణ, కాలిపోతున్న గుండె, నుసిగా మసిగా దహించుకుపోయిన దేహం. దాన్ని పట్టుకొని ప్రాకులాడిన గుండె. కొట్టుకోలేక తల గోడకేసి కొట్టుకొన్న గుండె- గుండె- గుండె ఉన్న దేశం నా భర్తను నా భర్త అని చెప్పలేక, ఒప్పుకోలేక, అంగీకరించలేక, ప్రకటించలేకపోవటం సిగ్గుచేటు. ఇంతకంటే దారిద్ర్యం, దౌర్భాగ్యం, దౌష్ట్యం ఏముంటాయి? ఎందుకుంటాయి? ఎక్కడుంటాయి?'

కోర్టులో కేసు విచిత్రంగా నడుస్తూ ఉంది.

డియన్ఎ టెస్టులో ఏదో పొరపాటు జరిగిందని తలపోసినవాళ్ళున్నారు.

అసలు టెస్టు ఫూల్‌ప్రూఫ్ కాదన్న వాళ్ళూ ఉన్నారు.

రమ తన కూతురు కాదంటాడు రంగారావు. నేను రసరాజ్యం కూతుర్ని అంటుంది రమ. రంగారావు నా భర్త అంటుంది రసరాజ్యం.

రమను కోర్టు అడిగింది.

'మీ తండ్రి ఎవరు?'

'మీ తండ్రి ఎవరో మీరు చెప్పగలరా?' ఎదురు ప్రశ్న వేసింది.

'ప్రశ్నించకూడదు. సమాధానం చెప్పాలి.'

'మా అమ్మ చెప్పింది'

'మీరు అతనికి పుట్టలేదు.'

'నేను మా అమ్మకు పుట్టాను!'

'తల్లి?'

'వాస్తవం!'

'తండ్రి'

'విశ్వాసం!'

'వాస్తవం చెప్పగలరు'

'అవును!'

'విశ్వాసం చెప్పలేరు'

'అవును'

'రంగారావు నీ తండ్రికాదు!'

'నేను ఔననను. కాదనను. నాకు తెలియదు. మా అమ్మ ఎంత చెబితే అంత. ఏం చెబితే అదే.'

'అది ఆమెకు మాత్రమే తెలుసునంటారా?'

'అనను'

'ఆమెకు కూడా తెలియదా?'

'తెలియవచ్చు. తెలియకపోవచ్చు. తెలుసునని కానీ తెలియదని కానీ నేను అనను'

'మీరు రంగారావు కూతురైతే ఈ కేసు ఓడిపోతారు. కాకపోతే గెలుస్తారు. అతడి కూతురివా? కాదా?'

'పరీక్షించారు. మీరే తేల్చండి'

'రంగారావు మీ తండ్రికాదు!'

'నిజమైతే తీర్పు చెప్పండి!'

'నిజం కాదా?'

'మీరే నిర్ణయించాలి!'

'మీ అమ్మకు పెళ్ళయిందా?'

'నాకు తెలియదు'

'మీ చిన్నతనంలో మీ యింట్లో మీ నాన్న ఉండేవాడా?'

'నాకు తెలియదు'

'మీ అమ్మకు అక్రమ సంబంధాలుండేవా?'

'నాకు తెలియదు'

'మీ తండ్రి ఎవరో తేలకపోతే కేసు తేలదు'

'మీరు తెలుసుకోగలరా? మీకు సాధ్యమా? మీరు మామూలు మనుషులు. అసాధ్యం మీద ఆధారపడి ఎందుకు ఆర్భాటం చేస్తున్నారో తెలియదు'

'ఎందుకు తెలియదు?'

'ఉప పాండవులకు దండ్రులు ఎవరు? ఎవరికెవరో మీకు తెలుసా? తెలియదు. ఆ రోజుల్లో డియన్ఎ లేదు.'

'పుక్కిటి పురాణాలు వద్దు'

'మాతృస్వామిక వ్యవస్థలో ఏ పురుషుడికి ఏ బిడ్డ సంతానమో ఎవరు చెప్పగలరు? రాణికి పదిమంది పురుష సేవకులు, ఫలానా బిడ్డ తండ్రి ఫలానా సేవకుడని తెలియదు. పిల్లలందరూ ఆ తల్లి సంతానమే.'

'కాలం మారింది. వ్యవస్థ మారింది. మీ అమ్మ మాతృస్వామిక వ్యవస్థ వ్యక్తికాదు.'

'కాని ఉపపాండవుల తల్లి నాకు తెలుసు!'

భారతదేశంలో ఇంతదాకా పుట్టి పెరిగి పాలించి గతించి, పాలింపబడి, అంతరించి పోయిన అన్ని సంస్కృతుల నాగరికతల వ్యవస్థల వ్యక్తుల్ని కన్న తల్లులు నాకు తెలుసు. తండ్రులు నాకు తెలియదు. ఆ తల్లులు వాస్తవం. ఆ తల్లులు వీడు నీ తండ్రి అంటే సంతానం విశ్వసించింది. సమాజం విశ్వసించింది. సంస్కృతి విశ్వసించింది. తల్లి వాస్తవం. తండ్రి విశ్వాసం.'

'అరాచకవాదంగా ఉంది!'

'అర్థంకాకపోతే అంతే!'

'స్పష్టంగా తెలిసేట్టు చెప్పటం వల్ల కేసు ముగింపుకు వస్తుంది'

'ప్రపంచంలో అతి ప్రాచీన వృత్తి వ్యభిచారం. అవునా?'

'అవును!'

'ఎందరో విటులతో నెలంతా గడిపిన వేశ్యకు పుట్టిన సంతానంలో ఆ బిడ్డకు ఏ విటుడు తండ్రో చెప్పగలరా? విటులందరినీ పరీక్షించలేరు. అది శాస్త్ర విజ్ఞానం. అభివృద్ధి చెందని దశ'

'వేశ్యా సంతానం!'

'తండ్రెవరో చెప్పగలరా?'

'చెప్పలేం?'

'అది చెప్పటం ఎప్పటికీ సాధ్యం కాదు'

'మీ తల్లి వేశ్యనా?'

'నేనామాట అనలేదు'

'కానీ తండ్రి తెలియాలి'

'ఎవరికి? తల్లికా, పుట్టిన బిడ్డకా? ఎందుకు? వాళ్ళిద్దరికీ వాడెవడో అక్కరలేదు. మరెవరికి తెలియాలి. కోర్టుకా? తెలిసి ఏం లాభం? కళ్ళు కానని అంధ యుగంలో దిక్కుమాలిన పెళ్ళీ పేరంటం లేని పిచ్చి సన్నాసులు బీజప్రాధాన్యం చెప్పినంత మాత్రాన క్షేత్ర ప్రాధాన్యం గాలికి కొట్టుకుపోతుందా? కాలం మారిందని, సమాజం మారిందని గుర్తించే మీరు ఒకనాడెప్పుడో, ఎవరికో, ఎందుకో ఉద్దేశించిన తండ్రి ముఖ్యమనే ముక్క నేడు పట్టుకొని వేలబడుతున్నారే

భారతదేశంలో ఇంతదాకా పుట్టి పెరిగి పాలించి గతించి, పాలింపబడి, అంతరించి పోయిన అన్ని సంస్కృతుల నాగరికతల వ్యవస్థల వ్యక్తుల్ని కన్న తల్లులు నాకు తెలుసు. తండ్రులు నాకు తెలియదు. ఆ తల్లులు వాస్తవం. ఆ తల్లులు వీడు నీ తండ్రి అంటే సంతానం విశ్వసించింది. సమాజం విశ్వసించింది. సంస్కృతి విశ్వసించింది. తల్లి వాస్తవం. తండ్రి విశ్వాసం.'

మీకేమయినా సాంఘిక న్యాయం తెలుసా? మానవ ప్రాధాన్యం తెలుసా? సమాజ స్థితీ గతీ అర్థమవుతున్నాయా?'

'అర్థమయ్యేట్టుగా చెప్పాలి'

'ఆర్థికంగా స్వాతంత్ర్యం వచ్చాక ఒక స్త్రీ ఇప్పుడు లభించే మగవేశ్యలతో లైంగిక సంబంధం కొనసాగించవచ్చు కదా!'

'కొనసాగించవచ్చు. కానీ అందుకే స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండకూడదని తిరస్కరించటం.'

'ఇంక అది అసాధ్యం. ఎవరూ తిరస్కరించలేరిప్పుడు. చదువు వచ్చి, ఉద్యోగం వచ్చి, చేతికి జీతం వచ్చి ఆర్థికస్థితి ఏర్పడ్డ స్త్రీ ఆస్తిని ఎవరూ తస్కరించరు. కన్న బిడ్డలందరికి తల్లిదండ్రుల వంశపారంపర్య సంపద సమంగా పంచాలన్న న్యాయశాస్త్ర పరిధి నుంచి ఎవరూ తప్పించుకోలేరు.'

'అందుకే కట్నం కానుకలు ఇవ్వటం?'

'కట్నమంటే జైలుశిక్ష అని మీకు తెలుసు. ఆమె సొమ్ము ఆమెకివ్వటం ఆమె హక్కు. స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యం ఎవరూ ఆపలేరు.'

'కావచ్చు'

'ఆర్థిక స్వేచ్ఛ ఉన్న స్త్రీ అవసరార్థం, సంతానం కోసమే, మగ వేశ్యలతో అనేకులతో సంబంధం కొనసాగిస్తే, పుట్టినబిడ్డ ఎవరికి పుట్టినట్లు?'

'వాళ్ళెవరో తెలిస్తే!'

'తెలియదు. చీకటి మనుషులు చీకటిలో కలిసిపోయి ఉంటారు?'

'అప్పుడు కష్టమే! మీ అమ్మ మగ వేశ్యలతో సంసారం చేసిందా?'

'నేనామాట అనలేదు!'

'మరి?– మరేమంటున్నారు?'

'పోషించగల మగవాడు పదిమంది ఆడవాళ్ళను ఉంచుకొన్నట్లే, పోషించగల స్త్రీ అనేకుల్ని మగవాళ్ళను ఉంచుకోవచ్చు కదా'

'సాధ్యమే!'

'ఆ అనేకుల్లో చాలామంది మారిపోతూ ఉండవచ్చు.'

'సాధ్యమే!'

'మరీ ఊరూపేరూ లేని ఉంపుడుగత్తెలలాంటి ఉంపుడుగాళ్ళలో ఎవరు ఏ బిడ్డకు తండ్రో ఎలా తెలుస్తుంది?'

'తెలియదు. మీ తల్లి ఉంపుడుగాళ్ళను ఉంచుకొందా?'

'నేనామాట అనలేదు. అనని మాటను అడగరాదు.'

'ఈ బిడ్డ తండ్రి ఈమనిషని ఎవరైనా పేర్కొన్నంత మాత్రాన, ఆ మనిషే ఆ బిడ్డ తండ్రి అని గేరంటీ లేదు.'

'నిజమే లేదు!'

'రంగారావు తండ్రి అని రాసినంత మాత్రాన అతడు తండ్రి అయి తీరాలని నిక్కచ్చిగా చెప్పలేం కదా!'

'చెప్పలేం కాని, తల్లి ఈ బిడ్డ తండ్రి ఫలానా అంటే సమాజం విశ్వసించాలికదా!

'విశ్వసించాలి! ఎప్పుడు?'

'ఆమె చెప్పినప్పుడు!'

'ఆమె ఏమి చెప్పింది. ఎప్పుడు చెప్పింది. ఏ పరిస్థితుల్లో చెప్పింది. ఏ స్థితిలో చెప్పింది. ఏ దశలో చెప్పింది. ఏ విషమ విచిత్ర పరిస్థితుల్లో చెప్పింది తప్పక తెలియాలి కదా!'

'తెలియాలి!'

'రంగారావు నా భర్త అంటుంది కానీ–'

'కానీ?'

'రమ తండ్రి అనటం లేదు!'

'స్కూలు రికార్డుల్లో?'

'రాయించింది. కానీ అనటం లేదు, రాత వేరు. మాట వేరు. నోటి మాటకు చేతిరాతకు తేడా ఉంది.

'చేతిరాత ముఖ్యం!'

'అది ఆమె రాయలేదు!'

'నోటిమాట– రంగారావు అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ నా భర్త అంటుంది'

'నోటి మాట చెల్లదు'

'కాబట్టి రంగారావు రమ తండ్రి కాదు అని తీర్పు చెప్పవలసిందిగా కోర్టు వారిని కోరుతున్నాను. అతడికి విముక్తి కలిగించండి. అతడి పరువు ప్రతిష్ఠలు కాపాడండి.'

'అతడు మీ తండ్రి కాదని తెలిసినంత మాత్రాన మీ తండ్రి ఎవరో తెలిసినట్లు కాదు. మరి మీ తండ్రి?'

'కోట్ల సందర్భాలలో తెలియదని, తెలుసుకోలేరనేది స్పష్టం.'

'ఈ కేసు సందర్భంలో–'

'తెలుసుకోగలిగితే– మీ అదృష్టం! నేను నా

తల్లి కూతురిని. న్యాయానికి, ధర్మానికి, రాజ్యాంగానికి వారసత్వ చట్టాలకు, హిందూ ధర్మశాస్త్రాలకు, అత్యుత్తమ, అత్యున్నత న్యాయస్థానానికి, ధర్మాసనానికి ముఖ్యం ఏమిటంటే నేను నా తల్లి కూతురిని అని అంగీకరించటం.'

మనకున్న శాసనాల ప్రకారం–

'నాకు తెలుసు. శాసనాలు పుడతాయి. గతిస్తాయి. కొత్త శాసనాలు అమలులోకి వస్తాయి. అంతరించిపోతాయి. అర్ధశతాబ్ది పూర్వం మనకు ఈ రాజ్యాంగంలేదు. ఇది నూరుసార్లు మార్పులకు గురయింది. మార్పులన్నీ శాసనాలయ్యాయి. అమలు అవుతూ ఉన్నాయి. శాసనం శాశ్వతం కాదు. శాసనం మానవ నిర్మితం. దైవదత్తం కాదు. శాసనాలు మారాలి. సమాజం మారినట్లు న్యాయం ధర్మం శాసనాలు మారాలి. మారతాయి. మార్పు పరిణామ లక్షణం. మారకపోతే మనం ప్రాచీన సమాజ ప్రతినిధులం. ప్రాచీన మానవులం. మారితే మనం ఆధునికులం, అభివృద్ధి చెందిన మానవులం. మళ్ళీ చెబుతున్నాను. తల్లి వాస్తవం. తండ్రి విశ్వాసం. తల్లి స్పష్టం. తండ్రి అస్పష్టం. తల్లి ప్రత్యక్షం. తండ్రి పరోక్షం. తల్లి ముఖ్యం. తండ్రి అముఖ్యం. తల్లి నిజం, తండ్రి కల్పన. బిడ్డ అస్తిత్వం వాస్తవం మీద ఆధారపడి ఉండాలి. కల్పన మీద కాదు. నమ్మకం మీద కాదు.

'మీరు ప్రతిపాదించేవి ఏమిటి?'

'ప్రస్తుత చట్టం మారాలి. శాసనం మారాలి. న్యాయస్థానం మార్పును ప్రతిపాదించాలి. దేశం దాన్ని శాసనం చేయాలి. అది అమలుకావాలి. ఇంత సిద్ధ న్యాయస్థానం, ఇందరు మేధావులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఆలోచనపరులు, సమాజమంతా కలిసి మారిన సమాజానికి అవసరమైన ధర్మసూత్రాలు ప్రతిపాదించలేకపోతే ఇంత పెద్ద న్యాయవ్యవస్థ దుర్గతి పొందినట్లే. పతనమయినట్లే. పాడయిపోయినట్లే– న్యాయాన్ని ఉద్ధరించండి. న్యాయవ్యవస్థను కాపాడండి. ఏనాటిదో ఒక కుంటి కూత, గూని మాట శాశ్వతంగా నిలుస్తుందని భ్రమించకండి.'

జడ్జి తల పట్టుకొని కూర్చున్నాడు.

'మీ వాదనలో బలముంది. ఆ పని పార్లమెంటు చట్టం చేసిందాకా, కోర్టులు, ఉన్న శాసనాల పరిధిలో, నిర్ణయాలు తీసుకొంటాయి. తీర్పులు చెబుతాయి.

'మార్పుకు మార్గం సుగమంచేయమని కోర్టువారని కోరుతున్నాను.'

'కేసు తీర్పు చెప్పటానికి మీ తండ్రి తెలియవలసే ఉంది'

'ఏభై ఏళ్ళు గడిచాక, నాకు తెలియని నా తండ్రి నొకణ్ణి సృష్టించి, ఋజువు చేసి కేసు నెగ్గాలని నేను కోరటంలేదు. లేనివాణ్ణి పుట్టించలేను. అంతులేనివాణ్ణి, అందనివాణ్ణి నేనివాళ అన్వేషించలేను'

కేసు వాయిదాపడింది. 'వాస్తవం తెలిస్తే, రమ తల్లి చెబితే న్యాయవిచారణ ముగుస్తుంది. తీర్పు వస్తుంది. కానీ అప్పటికి రమ వాస్తవం చెప్పింది. కొత్తగా చెప్పేది ఉండదని తేల్చింది.

'మా అమ్మను నేను హింసించలేను. నన్ను కన్నందుకు శిక్షంచలేను. పోషించినందుకు బాధించలేను. దేవతను దెయ్యం చేయలేను. స్వర్గంనరకంగా మార్చలేను. నా తండ్రిని నేను వెతకలేను. నాకది అసాధ్యం.'

రమ కన్నీళ్ళు తుడుచుకొంది.

'నన్ను మన్నించండి. ఇంక నేను కోర్టుకెటూ చెప్పుకోలేను. మాట్లాడలేను. నన్నింక కోర్టుకు పిలవవద్దు. నేను రాను. కోర్టు ధిక్కారం నాకు తెలుసు. ఏం తీర్పు ఇస్తారో ఇవ్వండి. ఏం శిక్ష వేస్తారో వేయండి. ఏంచేయాలో నాకు తెలుసునని మీకూ తెలుసు.'

హిందూ మహాసముద్రం ఘోషించి ఘోషించి మౌన మహాసాగరమయింది. మౌన కల్లోలిని అయింది. మౌన సప్తసముద్రిత మహాప్రపంచమయింది.

రమ కూర్చుండిపోయింది.

ఆమె కళ్ళలో తన తల్లి గతం తెరలు తొలిగి అరలు ఊడి, గోడలు కూలి, అడ్డం తొలగి విశాలంగా విస్తరించిన బయలు ఏర్పడి అంతా స్పష్టంగా కనిపించసాగింది.

> **'కానీ తండ్రి తెలియాలి'**
> **'ఎవరికి? తల్లికా, పుట్టిన బిడ్డకా? ఎందుకు? వాళ్ళిద్దరికీ వాడెవడో అక్కరలేదు. మరెవరికి తెలియాలి. కోర్టుకా? తెలిసి ఏం లాభం? కళ్ళు కానని అంధ యుగంలో దిక్కుమాలిన పెళ్ళీ పేరంటం లేని పిచ్చి సన్నాసులు బీజప్రాధా న్యం చెప్పినంత మాత్రాన క్షేత్ర ప్రాధాన్యం గాలికి కొట్టుకు పోతుందా? కాలం మారిందని, సమాజం మారిందని గుర్తించే మీరు ఒక నాడె ప్పుడో, ఎవరికో, ఎందుకో ఉద్దేశించిన తండ్రి ముఖ్యమనే ముక్క నేడు పట్టుకొని వేలబడు తున్నారే మీకేమయినా సాంఘిక న్యాయం తెలుసా? మానవ ప్రాధాన్యం తెలుసా? సమాజ స్థితీగతీ అర్థమవుతున్నాయా?**

** ** **

విశాఖపట్టణంలో రంగారావును కలుసుకొనే వీలులేక, అతను మద్రాసు బయలుదేరుతున్నాడని తెలుసుకొని, కలుసుకొని, మాట్లాడాలని, తన ప్రేమ చెప్పాలని, ప్రేమించబడాలని, మనిషిని కలిస్తే మనసులు కలుస్తాయని మనువు ఏర్పడుతుందని ఆశించి తప్పిపోయిన రైలు ఎక్కింది రసరాజ్యం.

అప్పటికే ఆమె మనస్థితి అదుపు తప్పి ఉంది. అదుపు తప్పే వయసు. పిచ్చి ప్రేమ. ఆ పిచ్చిలోనే బయలుదేరింది. రావు కనిపించలేదు. మాట్లాడలేదు. మద్రాసు కాలేజీల చుట్టూ తిరిగింది.

యువతి, సౌందర్యవతి, వంటినిండా నగలున్న సంపన్నురాలు. చేతినిండా డబ్బున్న తెలుగు బిడ్డ. మద్రాసులో కాలేజీలలో కనబడ్డ యువకుల్ని యువతుల్ని రావును గురించి అడుగుతూనే వుంది. మద్రాసులో తలదాచుకొనే చోటులేని ఒంటరి స్త్రీ. ప్రియుడి కోసం, భర్త కావలసిన రావు కోసం ఆరాటపడుతున్న, అదుపాజ్ఞల్లోలేని మనశ్శరీరాల మనుగడలో మగ్గుతున్న మనిషి. అసహాయురాలు. నమ్మకం వమ్మయిన దయనీయురాలు. ఆదరించే రంగారావు అందని దురదృష్టవంతురాలు మరీ పిచ్చిదయింది.

ఆమెతో ఎవరో స్నేహం చేశారు. ఆశలు చూపించారు. ఆ ఎవరో ఎవరో ఎవరికీ తెలియదు. సొమ్ము దోచుకున్నారు. ఇంకా ఏం దోచుకోగలరో అంతా దోపిడీ జరిగింది.

మద్రాసు సెంట్రల్ స్టేషన్లో బిచ్చమెత్తుకొంటున్న నిండు నెలల పిచ్చిదాన్ని గుర్తించారు, నిద్రాహారాలు మాని వెతకని చోటు లేకుండా వెదుకుతున్న తల్లిదండ్రులు. కూతురి ఆచూకీ తెలిసి ఇంటికి తీసుకువచ్చారు.

'వద్దు రంగా! నన్ను పాడుచేయొద్దు రంగా! మనం పెళ్ళి చేసుకొందాం రంగా. నేను నీ దాన్ని రంగా. నా ఆస్తి నీది. నా శరీరం నీది. నా మనస్సు నీది. నా హృదయం నీది. నా సర్వస్వం నీది. నేనంతా నువ్వే! నేనే నువ్వు నీకేం కావాలన్నా ఇస్తాను. తీసుకో ఏం కావాలన్నా తీసుకో! ఏమయినా చేసుకో, నన్ను పాడు చేయకు రంగా, నన్ను పాడు చేయకు. నన్ను పాడు చేయకు. రంగా, రంగా, రంగా' అంటూనే ఉంది. కాన్పయిందాకా ఆమె ప్రతి క్షణం ఆ మాటలు అంటూనే ఉండిపోయింది.

నెలలు నిండి కాన్పయి, బంగారంలాంటి పాప. ఆడబిడ్డ పుట్టిందాకా ఆమె నన్ను 'పాడు చేయకు రంగా' అంటూనే ఉంది. బిడ్డ పుట్టాక నన్ను పాడు చేయకు రంగా అనటం మానేసింది. పిచ్చిచూపులు, మాటలు, చేష్టలు తగ్గిపోయాయి. కానీ 'అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ రంగారావే నా భర్త' అనసాగింది. రెట్టించి అడిగితే 'నాటికీ నేటికీ ఏనాటికీ రంగారావే నా భర్త' అని మౌనంగా ఉండిపోతుంది.

బిడ్డను క్షణం వ దిలి ఉండేదికాదు రసరాజ్యం. రంగారావు పెళ్ళయిందని ఎవరో చెప్పారు. విందో, వినలేదో ఏమీ మాట్లాడలేదు. ఆమె పెళ్ళి చేసుకోలేదు. ఆ ప్రస్తావనే రానీయలేదు. ఒంటరిగా ఇంట్లో కూతురితో అద్భుత ఆనందం పొందింది.

** ** **

కోర్టులో న్యాయమూర్తి 'నీ భర్త ఎవరు?' అని అడిగాడు.

'అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ రంగారావే నా భర్త' అంది.

'అంటే?' అని రెట్టించాడు.

'నాటికీ, నేటికీ, ఏనాటికీ రంగారావే నా భర్త' అంది.

'రమ?'

'రమ నా కూతురు!'

కోర్టు హాలులో రంగారావు రసరాజ్యం దగ్గరకు వచ్చి 'నన్ను క్షమించు' అన్నాడు.

ఆమె విందో, వినలేదో, చూచిందో, చూడలేదో మౌనంగా తలవంచుకొని వరండాలో వెళ్ళిపోతూ ఉంది.

న్యాయమూర్తులు తలపట్టుకొని కూర్చున్నారు. •